సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 17 । ఆగస్టు । 2023



శ్రీ ఆంజనేయం .. ప్రసన్నాంజనేయం

రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి ఆంజనేయ స్వామి సన్నిధిలో నేటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు జరగనున్నాయి. -8లో



ఈ అన్నం మా పిల్లలకొద్దు..

దేవపట్ల సమీపంలోని మిట్ట వద్ద నున్న అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో భోజనం అధ్వానంగా ఉందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.560
రెండోరకం	రూ.300	రూ.410



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 272 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	360	530
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 386.560 కిలోలు

న్యూస్‌రీల్

ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ: శ్రావణమాసం పురస్కరించుకుని వివిధ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సరీ్వసులు నడప నున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఈనెల 26న మదనపల్లె నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. వాల్మీకిపురం రామాలయం, తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోందడరామాలయం, దేవునికడపలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకోవచ్చన్నారు. రాను, పోను టిక్కెట్ రూ.600 చెల్లించాలన్నారు. అల్ట్రాడీలక్స్ బస్సు ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9550655816,9000935897 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గండి క్షేత్రంలో హుండీ ఆదాయం లెక్కింపు

చక్రాయపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో భక్తులు కానుకల రూపంలో చెల్లించిన హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. 77రోజులకు ఆలయ హుండీల ద్వారా రూ.18,95,354లు, అన్నదానం హుండీ ద్వారా రూ.14,516లు ఆదాయం వచ్చిందన్నారు. అలాగే 1900 గ్రాముల బంగారం, 1.250 కేజీల వెండి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజా రమేష్, రాజగోపాలాచార్యులు, చక్రాయపేట ఏపీజీబీ మేనేజర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కడప మీదుగా వేలాంగిణికి ప్రత్యేక రైలు



కడప కోటిరెడ్డిసర్కిల్ : బాంద్రా నుంచి వేలాంగిణికి కడప మీదుగా ప్రత్యేక రైలు నడపనున్నారని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. సెప్టెంబరు 7వ తేదీన ఈ ప్రత్యేక రైలు (09043/44) బాంద్రాలో రాత్రి 9.20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4.53 గంటగలకు కడపకు చేరుకుంటుంది. మరుసటిరోజు ఉదయం 10.05 గంటలకు వేలాంగిణికి చేరుతుందన్నారు. తిరిగి వేలాంగిణిలో అదేరోజు రాత్రి 9.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్న 1.20 గంటలకు కడపకు వస్తుంది. మరసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు బాంద్రా చేరుతుందన్నారు. ఈ రైలు లోనావాలా, పూణె, డౌండ్, షోలాపూర్, కలబురిగి, వాడి, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, రేణిగుంట, కాట్పాడి, వేలూరు, తిరుమన్నామలై, విల్లుపురం, కడలూరు, చిదంబరం, చిరకాజి, మైలాదుతురై, తిరువావూరు, నాగపట్నం మీదుగా వేలాంగిణికి చేరుతుందని వివరించారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

19 నుంచి పర్యటన

రాయచోటిటౌన్: రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ కట్ట జనార్దన్ రావు జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 19వ తేది శనివారం రైల్వే కోడూరు నియోజకవర్గంలోని కండులవారిపల్లెకు రాత్రి 7 నుంచి 7–45 గంటల మధ్య చేరుకుంటారు. అక్కడో వివాహ వేడుకల్లో పాల్గొంటారు. 20వ తేది ఉదయం 7 గంటల నుంచి 7.45 గంటల మధ్య కండులవారిపల్లె పర్యటనలో పాల్గొంటారు. ఉదయం 8–30 గంటలకు కోడూరు నుంచి ఒంటిమిట్ట కోదండరామాలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకుంటారని అధికారులు తెలిపారు.

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలి

ప్రొద్దుటూరు: విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ తెలిపారు. ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు, రాజపాళెం, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, కొండాపురం, ముద్దనూరు, కమలాపురం, ఎర్రగంట్ల మండలాల్లో పెండింగ్‌లో ఉన్న 200 కొత్త వ్యవసాయ సర్వీసులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. సకాలంలో విద్యుత్ సేవలు అందించని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలని, వర్క్ క్వాలిటీ విజయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు.

అభివృద్ధి పరుగులు



పట్టణ పరిధిలోని సుండుపల్లె, రాజంపేట మార్గంలో వేగంగా జరుగుతున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు

- రాయచోటిలో రూ.16 కోట్లతో నాలుగులైన్ల రహదారి నిర్మాణం పనులు
- నిధులు మంజూరు పనుల వేగవంతంపై ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చొరవ

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, క్రీడా మైదానాలు, రహదారులు, వైద్యశాలల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇక పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులు సైతం కొత్త సొగసులు అద్దుకొని పెరుగుతున్న రవాణాకు అనుగుణంగా రోడ్డు విస్తరణ జరుగుతోంది. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి నియోజకవర్గం అభివృద్ధితోపాటు రాయచోటి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే రూ. 4 కోట్లతో ఎస్ఎన్ కాలనీ నుంచి గున్నికుంట్ల మార్గంలోని రింగ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ, వీధిలైట్లు ఏర్పాటుతో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగైంది. ఇదే పరిస్థితిలో అత్యంత రద్దీగా ఉన్న ఠాణా సర్కిల్ నుంచి సుండుపల్లె మార్గంలోని రింగ్ రోడ్డు సర్కిల్ వరకు రూ. 16 కోట్లతో నాలుగు వరుసల రహదారి నిర్మించే పనులు చేపట్టారు. 60 నుంచి 65 అడుగుల వెడల్పుతో నాలుగు వరుసల రహదారిగా ఈ రోడ్డు నిర్మాణం పనులు 50శాతంకుపైగా పూర్తయ్యింది. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించడంలో సఫలీకృతులయ్యారు. ప్రస్తుతం రూ. 16 కోట్లతో రింగ్ రోడ్డు వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణాలను పూర్తి చేసే క్రమంలో ఆర్అండ్‌బీ అధికారులు ముందుకు సాగుతున్నారు.

అభివృద్ధికి అడ్డంకిగా....

రోడ్డు విస్తరణలో భాగంగా ఎమ్మెల్యే సూచనలు మేరకు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విస్తరణకు అవసరమైన నిర్మాణాలను తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఈ దశలో టీడీపీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు రోడ్డెక్కి గృహాలను అక్రమంగా తొలగిస్తున్నారంటూ ప్రజలను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేశారు. వారి వ్యాఖ్యలకు స్థానిక ప్రజలు మద్దతు ఇవ్వకపోవడంతో వెనుతిరగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ప్రజలందరికీ మంచే జరుగుతుందని స్థానికులు ప్రతిపక్ష పార్టీ నాయకులకు స్పష్టం చేయడం కొసమెరుపు.

అందరి సహకారం అభివృద్ధి పనులు

రాయచోటి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రణాళికతో ముందుకు పోతున్నారని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా అన్నారు. అభివృద్ధి పనులు పూర్తయితే భవిష్యత్తులో రాజకీయ పుట్టగతులు ఉండవన్న భయంతోనే టీడీపీ, ఇతర పార్టీలు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాయని మండిపడ్డారు. అందరి సహకారంతోనే పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

నెలరోజులలో పూర్తి చేస్తాం



రూ. 16 కోట్లతో చేపట్టిన నాలుగురోడ్ల రహదారి నిర్మాణం పనులను నెలరోజులలో పూర్తి చేస్తాం. సుండుపల్లె మార్గంలోని చెన్నముక్కపల్లి వద్ద ఆర్టీసీ డిపో ఉండడంతోపాటు సుండుపల్లె, రాజంపేట, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లే రహదారి కావడంతోవాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనువుగా 2.15 కిలోమీటర్ల దూరం ప్రాంతాన్ని రూ.16 కోట్లతో నాలుగు వరుసల రహదారి, డివైడర్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైట్స్ ఏర్పాటు పనులు చేపడుతున్నాం. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న నిర్మాణాల తొలగింపులు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజల సహకారం బాగుంది. అందరి సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. – గిరీశం, ఆర్అండ్‌బీ ఇంజనీర్

కాంట్రాక్టు లెక్చరర్ల జీవితాల్లో వెలుగులు

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించడంపై సర్వత్రా హర్షం



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి మిఠాయి తినిపిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో 2014 జూన్ 2కు ముందు ఉద్యోగంలో చేరి ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్‌ను ముఖ్యమంత్రి రెగ్యులర్ చేస్తూ తీసుకున్న నిర్ణయంపై కాంట్రాక్టు లెక్చరర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలతోపాటు పలువురు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, జిల్లా ఎమ్మెల్యేలు, ఏపీజీఈఏఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డిలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం స్పందించి 2014 ముందు నుంచి సర్వీస్‌లో ఉన్న ప్రతి కాంట్రాక్టు లెక్చరర్‌ను రెగ్యులర్ చేసేందుకు ఆగస్టు 15వ తేదీ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై జిల్లా కాంట్రాక్టు లెక్చరర్లంతా ఆనందం వ్యక్తం చేస్తూ బుధవారం సాయంత్రం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కడపలోని తమ కార్యాలయంలో కలిసి ఆయనకు మిఠాయి తినిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేమని సదా రుణపడి ఉంటామన్నారు. సీఎం తీసుకున్న నిర్ణయం ద్వారా ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలల్లో 3600 మంది, డిగ్రీ కళాశాలల్లో 600 మంది, పాలిటెక్నిక్ కళాశాలల్లో 350 లెక్చరర్లకు కుటుంబాల లబ్ధి చేకూరనుంది.కాంట్రాక్టు లెక్చరర్ల తరపున ఏపీ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వెట్టి చాకిరి నుంచి విముక్తి....



రాష్ట్రవ్యాప్తంగా గతంలో, ఇప్పుడు కలిసి 10,117 మంది కాంట్రాక్టు లెక్చరర్లను వెట్టి చాకిరి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విముక్తి కల్పించి రెగ్యులరైజ్ చేశారు. దీంతో మాకు కొత్త జీవితాన్ని ప్రసాదించినట్లయింది. ఇందుకు సీఎంకు కృతజ్ఞతలు. జగనన్నకు రుణపడి ఉంటాం. – ఎం. చంద్ర మోహన్‌రెడ్డి, ఏపీ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కడప

మాట నిలబెట్టుకున్న సీఎం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాంట్రాక్టు ఉద్యోగుల విషయంలో ఇచ్చిన మాటను నిల బెట్టుకున్నారు. దీంతో రాష్ట్రంలో వేలమంది కాంట్రాక్టు లెక్చరర్లు రెగ్యులర్ కానున్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపారు. మేము ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. -ప్రియదర్శిని, కాంట్రాక్టు లెక్చరర్


ఆనందంగా ఉంది



రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు గురైన కాంట్రాక్టు అధ్యాపకుల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెలుగులు నింపారు. ముఖ్యమంత్రి మా బాధను అర్థం చేసుకుని రెగ్యులర్ చేస్తూ నిర్ణయం తీసుకోవడం మాకు ఆనందంగా ఉంది. -రమణారెడ్డి, కాంట్రాక్టు లెక్చరర్, కడప

రైళ్లలో దోపిడీల నివారణకు ప్రత్యేక బృందాలు

- ప్రతి స్టేషన్‌లో కనీస సిబ్బంది ఉండేలా చర్యలు
- జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

మదనపల్లె: రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల రైళ్లలో చోరీలు, నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ సివిల్ ఫోర్స్‌ను రైల్వేశాఖకు మద్దతుగా ఇచ్చి నేరాల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని తాలూకా పోలీస్‌స్టేషన్‌లో రైల్వేశాఖ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలో కేసుల పురోగతి, అన్ డిటెక్టెడ్ కేసులు తదితరాలపై పోలీస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైళ్లను చీకటిప్రదేశాల్లో చైన్‌లాగి నిలుపుదల చేసి దోపిడీలకు పాల్పడే ముఠాలను పట్టుకునేందుకు రైల్వేశాఖకు మద్దతుగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఇటీవల మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో జరిగిన హత్య కేసుకు సంబంధించి కొన్ని ఆధారాలు లభించాయని, త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామన్నారు. అన్నమయ్య జిల్లా అంగళ్లులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన అల్లర్లపై నమోదైన కేసుకు సంబంధించి హైకోర్టు, జిల్లాకోర్టుల్లో పిటిషన్లు దాఖలవుతున్నందున, వాటిని ఏరకంగా ఎదుర్కోవాలి, ఏ విధమైన ఆధారాలు సమర్పించాలనే విషయమై పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ, ఉన్నతాధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు. పట్టణంలోని టూటౌన్ పరిధిలో జరిగిన లెక్చరర్ మర్డర్ కేసులో ఇప్పటివరకు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. రాత్రివేళల్లో దొంగతనాలు జరగకుండా సీఐ స్థాయి అధికారి ఆధ్వర్యంలో గస్తీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మదనపల్లె టౌన్‌లో ట్రాఫిక్‌సమస్య పరిష్కారంలో భాగంగా 30 మంది సిబ్బందితో ర్యెగులర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో జిల్లాలో అదనంగా మరో పోలీస్‌స్టేషన్ ఏర్పాటవుతుందన్నారు. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల నుంచి అన్నమయ్యజిల్లాకు బదిలీపై ఇటీవల పోలీస్‌సిబ్బంది రావడం జరిగిందని, ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కనీసం 10 మందికి తక్కువకాకుండా సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో సీఐలు సత్యనారాయణ, మురళీకృష్ణ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇంటి స్థలాలు

కలెక్టర్ గిరీషా పీఎస్



పులపత్తూరు గ్రామంలో ఇంటి నిర్మాణాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఓబులవారిపల్లె: ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వాసిత గ్రామాల ప్రజలకు ఇంటిస్థలాలు కేటాయిస్తామని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. బుధవారం మంగంపేట ఆర్ఆర్–5 ఇంటిస్థలాల లే అవుట్‌లను కలెక్టర్ గిరీషా పీఎస్ గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంగంపేట అరుంధతివాడ, దళితవాడ గ్రామస్తులు తమకు గుట్టపైన ఇంటిస్థలాలు కేటాయిస్తున్నారని, చదునుగా ఉన్న ప్రాంతంలో,అనుకూలమైన ప్రదేశాలలో ఇంటిస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు పలు అభ్యంతరాలు తెలిపారు. వారి అభ్యంతరాలు మేరకు కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మంగంపేట ఆర్ఆర్–5లో గ్రామస్తులతో మాట్లాడుతూ గుట్టపై చదును చేసి ఇండ్లు కట్టుకోవడానికి అనుకూల ప్రాంతంలో ఇంటిస్థలాలు కేటాయిస్తామని స్కెచ్ ద్వారా ప్రజలకు వివరించారు. ఏటవాలు ప్రాంతాన్ని చదునుచేసి ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తామన్నారు. సీపీఓ సుదర్శన్ రెడ్డి, డీఈలు కుప్పుస్వామి, బాలనరసింహులు, తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావు, మంగంపేట గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణపనులను త్వరితగతిన పూర్తిచేయాలి

రాజంపేట: వరదపీడిత గ్రామమైన పులపత్తూరు (చెయ్యేరు నదీపరీవాహక)లో బాధితుల కోసం ప్రభుత్వం తరపున నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను కలెక్టరు గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం పులపత్తూరులో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను కలెక్టరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనుల్లో భాగంగా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. దారులు, తాగునీటి, విద్యుత్ సరఫరా పనులను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. త్వరితగతిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే తప్పకుండా చర్యలుతీసుకుంటామన్నారు. కలెక్టర్‌తో పాటు రాజంపేట రెవిన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి, హౌసింగ్‌ఈఈ మురళీ, తహసీల్దారు ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమర్థతే లీడర్ లక్ష్యం

- పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు కీలకం
- సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలపై శిక్షణ
- నాలుగు జిల్లాల పరిధిలో హెచ్ఎంలకు శిక్షణ
- నెలాఖరు వరకు కొనసాగనున్న లీడర్ ప్రోగ్రాం



శిక్షణ పొందిన హెచ్ఎంలు

మదనపల్లె సిటీ: రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలు, నాడు–నేడు కింద ప్రభుత్వ బడుల రూపురేఖలు దశలవారీగా మారుస్తున్నారు. అలాగే జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్ఎం పోస్టులను నూరుశాతం భర్తీ చేశారు. తాజాగా హెచ్ఎంలలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు 'లీడర్' ప్రోగ్రాం తీసుకొచ్చారు.

నాయకత్వం సాధికారతకు.....

పాఠశాలను సమర్థవంతంగా నిర్వహించే మంచి నాయకుడిగా హెచ్ఎంలను తీర్చిదిద్దే లక్ష్యంతో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నాయకత్వంపై వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తిరుపతిలో గత నెల 6 నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శిక్షణ షెడ్యూల్, మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (ఏపీ సీమాట్) సంస్థ రూపొందించింది. తిరుపతిలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లా లకు చెందిన హెచ్ఎంలకు రెసిడెన్షియల్ విధానంలో ప్రత్యేక వృత్యంతర శిక్షణ కార్యక్రమం జాయింట్ డైరెక్టర్, శిక్షణ తరగతుల కోర్సుల డైరెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఇప్పటి వరకు 4 బ్యాచ్‌లు పూర్తి చేశారు. 5వ బ్యాచ్‌కు శిక్షణ జరుగుతుంది.

సమగ్రంగా..సంపూర్ణంగా...

ప్రభుత్వ పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించాలంటే ఆయా పాఠశాలల హెచ్ఎంలకు తప్పనిసరిగా దృఢమైన నాయకత్వ లక్షణాలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలో నుంచి రూపొందిందే పాఠశాల నాయత్వంపై శిక్షణ. దీనిని సమగ్రంగా.. సంపూర్ణంగా ప్రధానోపాధ్యాయులకు అందించాలన్న లక్ష్యంతో తొలిసారిగా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీఈఓ పురుషోత్తం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ షెడ్యూల్ ప్రకారం హెచ్ఎంలకు శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణలోని అంశాలు

- ఉపాధ్యాయులలకు తరగతుల కేటాయింపు.
- నిధుల వినియోగం.
- హాజరు పెంపుదల.
- మధ్యాహ్నభోజనం.
- జేవీకె కిట్స్ పంపిణీ.
- విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధి.
- డిజిటల్ విద్యావిధానం అమలు.
- నాడు–నేడు పనుల పర్యవేక్షణ.
- టోఫెల్
- రోజుకో ఆంగ్ల పదం నేర్చుకోవడం.
- ఓఎంఆర్ ద్వారా సీబీఏ పరీక్షలు.
- విద్యాసంబంధిత యాప్‌ల నిర్వహణ.
- స్వీయ అవగాహనతో పాటు టీమ్‌వర్క్‌తో పాఠశాలలను అభివృద్ధి చేయడం.
- సహ ఉపాధ్యాయుల సమన్వయంతో లక్ష్యాన్ని పూర్తి చేయడం.
- విద్యావ్యవస్థలో మార్పులను ఆకళింపు చేసుకోవడం.

సమాజ భాగస్వామ్యంపై...



పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ఎలా వినియోగించుకోవాలి. వారి నుంచి వచ్చే మంచి, చెడు ఫలితాలను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకున్నాం. సమస్యలను ఎదుర్కోగలమనే నమ్మకం కలిగింది. మాకు నేర్పిన వాటిని విద్యార్థులకు నేర్పుతాం. -షాజహాన్, హెచ్ఎం, ఉర్దూ ఉన్నత పాఠశాల, మదనపల్లె

మంచి ఫలితాల సాధనకు దోహదం



పాఠశాల నిర్వహణలో నాయకత్వంపై మరింత పరిజ్ఞానం పొందాం. తోటి ఉపాధ్యాదయులను సమన్వయం చేసుకుని మంచి ఫలితాలు సాధించేందుకు శిక్షణ దోహదపడుతుంది. - సుబ్బారెడ్డి, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయమూర్తి జి.గీత

కడప కోటిరెడ్డిసర్కిల్: జువైనల్ జస్టిస్ చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని నాలుగో అదనపుజిల్లా న్యాయమూర్తి జి.గీత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ కమిటీ హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు జువైనల్ జస్టిస్ కమిటీ సిఫార్సులపై చైల్డ్ వైరుధ్యానికి సంబంధించిన అంశాలపై సంబంధిత డిస్ట్రిక్ట్ లెవెల్ కన్సల్టేషన్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటుచేశామన్నారు. పిల్లల నేరాల నివారణ, సైకాలజిస్టుతో కౌన్సెలింగ్, మళ్లింపు నిర్బంధానికి ప్రయత్నాలు, పిల్లల పునరావాసం, పునరుద్ధరణ పద్ధతులు, పిల్లల స్నేహపూర్వక విధానాల హక్కు, వృత్తి నైపుణ్య కోర్సులు, మందుల దుర్వినియోగం తదితర అంశాలను చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కె.భార్గవి, జువైనల్ జస్టిస్ బోర్డు కడప, అన్నమయ్యజిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, కడప దిశ డీఎస్పీ రమాకాంత్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుబాష్ యాదవ్, సైకాలజిస్టు సునీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధ్యాపకురాలి హత్యకేసులో మరొకరి అరెస్ట్


షేక్ మౌలా అలియాస్ షేక్ ఇమ్రాన్

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకురాలు రుక్సానా హత్య కేసులో అరెస్టుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు..బుధవారం మరొకరిని అరెస్ట్ చేశారు. రుక్సానా హత్యకేసు దర్యాప్తులో భాగంగా పట్టణంలోని సైదాపేటకు చెందిన షేక్ హుస్సేనీ కుమారుడు షేక్ మౌలా అలియాస్ షేక్ ఇమ్రాన్(23)ను అదుపులోకి తీసుకున్నారు. హత్యకేసులో నిందితుడు సులేమాన్‌కు మృతురాలు రుక్సానా కదలికలు గమనించి షేక్ ఇమ్రాన్ సమాచారం అందించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. హత్య జరిగిన రోజు సాయంత్రం ఇమ్రాన్ హైదరాబాదుకు పారిపోయాడని, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అన్ని ఆధారాలతో షేక్ ఇమ్రాన్‌కు హత్యకేసులో ప్రమేయం ఉందని నిర్ధారణ చేసుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. అయితే రుక్సానా హత్యకేసులో ప్రధాన నిందితురాలు ఆయిషాను అరెస్ట్ చేయాల్సి ఉందని, ఆమె పరారీలో ఉండటంతో పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో అటవీశాఖ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గం బాలిపల్లి రేంజ్ పరిధిలో బుధవారం ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి పది దుంగలను స్వాధీనం చేసుకున్నారు. బాలిపల్లి ఎఫ్ఆర్ఓ ప్రభాకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శేషాచలం అడవుల్లో కూంబింగ్ చేస్తుండగా బాలిపల్లి వెస్ట్ బీట్‌లో ఎర్రచందనాన్ని తరలిస్తున్న పడియన్, నటేషన్, శ్రీనివాసన్ అనే తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు తారసపడ్డారన్నారు. వారిని అరెస్టు చేసి వారివద్ద నుంచి పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ చంద్రకళ, ఎఫ్ఎస్ఓ బాలచంద్రుడు, ఎఫ్‌బీఓ సుబ్బలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం


గండి వీరాంజనేయస్వామి మూల విరాట్


గండిక్షేత్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆలయం


గండి వీరాంజనేయ స్వామి సన్నిధి

- నేటి నుంచి గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రావణ మాస ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తజనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు

చక్రాయపేట : శ్రావణ మాసం అంటే ఆంజనేయుడికి ఎంతో ప్రీతికరం. అలాగే ఆయన భక్తులకు ఈనెల అంటే ఎంతో ఇష్టం. శ్రావణమాసం వచ్చిందంటే ఆంజనేయుడి గుళ్ల ప్రత్యేక అలంకరణతో కళకళలాడతాయి. ఎక్కడ చూసినా భక్తులతో కిటకిటలాడతాయి. ఇందులో రాయలసీమ జిల్లాల్లో ప్రసిద్ధి గాంచిన గండి వీరాంజనేయ స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది కావడంతో శ్రావణమాసం ఉత్సవాలు భక్తులకు కనువిందు చేస్తాయి. ఎందుకంటే ఇక్కడి వీరాంజనేయుడు స్వయంగా శ్రీరాముడు చెక్కిన శిల్పం కావడం ఆయన ప్రతిష్ఠించిన విగ్రహం కావడంతో భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయ చరిత్ర పూర్వీకుల కథనం మేరకు ఇలా..

జానకి కోరిక మేరకు..

రావణ సంహారం అనంతరం సీతా సమేతుడైన శ్రీరామచంద్ర మూర్తి తిరిగి అయోధ్య వెళ్లే సమయంలో గండి క్షేత్రానికి వచ్చే సరికి చీకటి పడిందట. ఈ సమయంలో కొండకు కనిపించిన పెద్ద రాయిని చూసిన సీత అక్కడ తెల్లవారుజామున శుభ ఘడియలు ముగిసేలోపు ఆంజనేయుడి విగ్రహాన్ని బాణపు ములికితో చెక్కాలని కోరిందట. దీంతో శ్రీరాముడు ఆమె కోరిక మేరకు ఆంజనేయుడి విగ్రహాన్ని చెక్కడం ప్రారంభించాడు. శుభఘడియలు ముగిసే సరికి ఎడమచేయి చిటికెన వేలు మాత్రమే కొదవ పడటంతో ఆ ప్రయత్నం అంతటితో ఆపేసి విగ్రహాన్ని ప్రతిష్టింప జేశాడు. అనంతరం పూర్వీకులు భిన్నంగా ఉన్న విగ్రహం పూజలకు పనికి రాదని భావించి చిటికెన వేలిని మలిపించేందుకు శిల్పిని రప్పించి పని ప్రారంభించారు. శిల్పి వేసిన ఉలి దెబ్బ పడగానే ఆ చోటు నుంచి రక్తం రావడంతో భయపడి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. సీతాదేవి ఆంజనేయుని చిరంజీవిగా వర్ధిల్లు అని ఆశీర్వదించడంతో ఆయన ఇక్కడ సజీవంగా ఉన్నాడని భావించి అప్పటి నుంచి పూజలు చేస్తున్నారు. దీంతో ఇక్కడి ఆంజనేయుడిని భక్తులు ఎంతగానో విశ్వసిస్తారు.

బంగారు తోరణం

సీతాసమేతంగా విచ్చేస్తున్న శ్రీరాముడికి స్వాగతం పలికేందుకు గండిలో తపస్సు చేసుకుంటున్న వాయుదేవుడు రెండు కొండల మధ్యన బంగారు తోరణం నిర్మించి వారికి స్వాగతం పలికాడట. ఆ బంగారు తోరణం నేటికి కూడా ఉందని భక్తుల నమ్మకం. అది పుణ్యాత్ములకు మాత్రమే కనిపిస్తుందట. ఇప్పటి వరకు ఆ తోరణం ఇద్దరికి మాత్రమే కనిపించిందట. వారిలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్న సమయంలో జిల్లా కలెక్టర్‌గా ఉండిన సర్ థామస్ మన్రో ఒకరు కాగా గండి భూమానందాశ్రమ పీఠాధిపతి రామానంద స్వామి మరొకరట.

గండి అంటే..

గండిలో ఉన్న కొండలను శేషాచలం కొండలు అంటారు. ఇవి తిరుమల నుండి గండి వరకు మధ్యలో ఎక్కడేగాని తెగువ లేకుండా ఉన్నాయట. అలాంటి ఈ శేషాచల కొండలకు పాపాఘ్ని నది మధ్యలో గండి పెట్టిందట. దీంతో ఈ ప్రాంతానికి గండి అని పేరు వచ్చిందని చెబుతారు. ఇక్కడ వెలసిన స్వామిని గండి వీరాంజనేయస్వామి అని పిలుస్తారు.

దర్శనీయ స్థలాలు

గండి క్షేత్రం సమీపంలో పలు దర్శనీయ స్థలాలు ఉన్నాయి. వాటిలో ఉమామహేశ్వరాలయం, భూమానందాశ్రమం, నామాలగుండు, పావురాళ్ల గట్టు, దాసరయ్యకోన, మతంగ గుహ, ప్రేమానందాశ్రమం, చౌడేశ్వరీదేవి ఆలయం, గవిమల్లేశ్వర స్వామి ఆలయం, కోదండరామాలయం, గంగమ్మ దేవత ఆలయం, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్మృతివనం ఉన్నాయి.

రూ. 20కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే గండి ఆలయానికి రూ.14.5 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆలయాన్ని పూర్తిగా గ్రానైట్‌తో నిర్మిస్తున్నారు. చరిత్రలో నిలిచి పోయేలా దేవుళ్ల బొమ్మలతో కూడిన 130 రాతి స్థంభాలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. అయితే నిధులు సరిపడనందున మరో రూ.6కోట్ల మేర మంజూరు చేశారు. ప్రస్తుతం నిర్మాణ పనులు సుమారు 70 శాతం మేర జరిగాయి. ఆలయం నిర్మాణంలో ఉండటంతో ఇక్కడ బాలాలయం నిర్మించి ధారువుతో చేయించిన స్వామి విగ్రహాన్ని ఉంచి భక్తులతో పూజలు చేయిస్తున్నారు.

ఉత్సవాల నిర్వహణకు భక్తులు సహకరించాలి: ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి



శ్రావణమాసంలో గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శ్రావణ మాస ఉత్సవాలకు భక్తులతో పాటు అన్నిశాఖల అధికారులు సహకరించాలని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి కోరారు. ఉత్సవాలకు సంబంధించి క్యూ లైన్‌లు, తాగునీటి వసతి, అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చలువ పందిళ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక సదుపాయం, మొబైల్ ఏటీఎం, మొబైల్ బ్లడ్‌బ్యాంక్, వైద్య శిబిరం తదితరాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల సౌకర్యం కోసం టీటీడీ వారు జర్మన్ షెడ్డు వేశారని చెప్పారు. ముఖ్యంగా దర్శనం కోసం వీఐపీ పాసులు పొందిన వారు ఉదయం 5నుంచి 8గంటల వరకు తిరిగి సాయంత్రం 5 నుంచి 8గంటల వరకు మాత్రమే రావాలని సూచించారు. మిగిలిన సమయంలో పాసులను అనుమతించమని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య


ప్రసన్న మృతదేహం

తంబళ్లపల్లె : అనారోగ్య కారణాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలో జరిగింది. కుటుంబీకుల కథనం మేరకు.. జుంజరపెంట పంచాయతీ రామాపురానికి చెందిన కె.ఆనంద్ భార్య ప్రసన్న(24 అనారోగ్య కారణాలతో ఇంటి వరండాలో పైపునకు చీరతో ఉరి వేసుకుంది. గుర్తించిన భర్త వెంటనే కిందకు దించి ఆమెను తన ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భార్యపై భర్త దాడి

మదనపల్లె: భార్యపై భర్త దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన రవికుమార్ భార్య దేవి(39) కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి చిత్తూరు జిల్లా పుంగనూరులో ఉంటున్న స్నేహితురాలు వద్దకు వెళుతున్నాను అంటూ వచ్చేసింది. ఆమె పుంగనూరు కాకుండా మదనపల్లె పట్టణంలో లాడ్జిలో దిగింది. ఆమెను వెతుక్కుంటూ వచ్చిన భర్త ఆమె మదనపల్లెలో ఉందన్న సమాచారం తెలుసుకుని లాడ్జికి వచ్చాడు. దీంతో ఇద్దరు గొడవపడ్డారు. భర్త ఆవేశంతో ఆమెను విచక్షణ రహితంగా చితకబాదాడు. గాయపడిన బాధితురాలిని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టుటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు



రోడ్డుప్రమాదంలో గాయపడిన రెడ్డి ఉజ్వల్, రెడ్డిప్రసాద్

మదనపల్లె : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన రెడ్డిప్రసాద్(21), రెడ్డిఉజ్వల్ (21) కురబలకోట మండలం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో కాలేజీ నుంచి కడప రోడ్డులో ఉన్న హోటల్లో భోజనానికి వెళ్లారు. తిరిగి కాలేజీకి వస్తుండగా వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో యువకులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ అన్నం మా పిల్లలకొద్దు బాబోయ్!

- అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- అన్నంలో పురుగులు వస్తున్నాయని ఆవేదన
- హోటల్ నుంచి తెచ్చిన ఆహారం తింటున్న విద్యార్థులు



గురుకులం ఎదుటన నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

సంబేపల్లె : అంబేడ్కర్ గురుకులంలో తమ పిల్లలను ఉంచలేమంటూ మండల పరిధిలోని దేవపట్ల మిట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 500 పైగా విద్యార్థులు ఉన్న ఈ గురుకులంలో గత కొన్ని రోజులుగా భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు తెలిపారు. ఇప్పటికే పలు మార్లు గురుకులంలో నెలకొన్న సమస్యలపై ప్రిన్స్‌పాల్‌తో చర్చించినా ఆమె పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో హోటల్ నుంచి భోజనం తెప్పించుకుని తినాల్సి వస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో వారు గురుకులం ఎదుట ఆందోళనకు దిగారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న దేవపట్ల గ్రామ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి గురుకులానికి చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు తమ ఆందోళనను విరమించారు.

ప్రిన్స్‌పాల్‌ను సస్పెండ్ చేయాలి

దేవపట్ల గురుకులంలో నెలకొన్న సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్రీ కళాదేవిని సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ నాయక్ కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే గురుకులం వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేపడతానని హెచ్చరించారు.


హోటల్‌నుంచి తెచ్చిన భోజనాన్ని తింటున్న విద్యార్థినులు

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కురబలకోట : మండల పరిధిలోని దాదంవారిపల్లె సమీపంలోని గోళ్లపల్లె వద్ద గుర్తుతెలియని మహిళ(60) మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైంది. నాలుగు రోజుల క్రితం అక్కడి స్థానికులు ఆమెను చూసినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత ఆమె శవంగా మారింది. మతి స్థిమితం లేని మహిళ అయి ఉంటుందని భావిస్తున్నారు. స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముబీన్ తాజ్ తెలిపారు.

పట్టపగలు చోరీ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

గాలివీడు : మండల పరిధిలోని గోరాన్‌చెరువు గ్రామం ఒడిశలవంకపల్లెలో బుధవారం పట్టపగలే గుర్రం బ్రహ్మానందరెడ్డి ఇంట్లో దొంగలు పడి రూ.3 లక్షలు నగదు, 20 తులాల బంగారం దోచుకెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తలుపులను పగులగొట్టి లోనికి వెళ్లి బీరువాలోని నగదు, నగలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన డీఎస్పీ మహబూబ్‌బాషా, లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, ఎస్ఐ వెంకటశివప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకొని డాగ్‌స్క్వాడ్, వేలిముద్ర నిర్ధారణ ప్రత్యేక బృందంతో తనిఖీలు నిర్వహించారు. మరికొద్ది రోజుల్లో కుమార్తె వివాహం జరగాల్సి ఉన్న నేపథ్యంలో ఈ చోరీ జరగడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి : డీఎస్పీ

పట్టణాలతో పాటు, గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ మహబూబ్‌బాషా ప్రజలకు సూచించారు. విలువైన వస్తువులను, నగదును ఇంటిలో ఉంచరాదని, బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు.

అరవపల్లెలో..


చోరీ జరిగిన ఇంటిలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

నందలూరు(రాజంపేట) : మండలంలోని అరవపల్లెలో నివాసం ఉంటున్న సుభాషిణి ఇంటిలో చోరీ జరిగింది. బుధవారం రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఇంటికి తాళాలు వేసి వెళ్లిన క్రమంలో ఈ చోరీ జరిగింది. 77 గ్రాముల బంగారు అపహరణకు గురైనట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం వచ్చి సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


సుబ్రమణ్యం (ఫైల్)

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాలూకా పోలీసుల కథనం మేరకు తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన సుబ్రమణ్యం (53) తన భార్య మునీశ్వరితో కలిసి మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ వశిష్ట స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. తన ఇద్దరు పిల్లలు రమ్య, చందనల చదువు నిమిత్తం రెండు నెలల క్రితం ఇక్కడికి వచ్చి స్థిరపడ్డాడు. ఈ నెల 14న తన తమ్ముడు రాంప్రసాద్‌తో కలిసి స్కూటీ వాహనంలో మదనపల్లె పట్టణంలోకి వెళ్లి వ్యక్తిగత పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా వర్షం రావడంతో బైపాస్‌రోడ్డులోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రేకులషెడ్డు పక్కన ఆగారు. ఇంతలో పుంగనూరు కొత్తపేటకు చెందిన మునీర్‌బేగ్ బొలెరో పికప్ వాహనంలో కూరగాయల లోడ్ నింపుకుని కదిరికి వెళుతూ నిమ్మనపల్లె బైపాస్‌రోడ్డులో అదుపుతప్పి ఆంజనేయస్వామి రేకుల షెడ్డుతో పాటు అక్కడే ఉన్న ద్విచక్రవాహనాన్ని సుబ్రమణ్యం, రాంప్రసాద్‌లను ఢీకొన్నాడు. ప్రమాదంలో అన్నదమ్ములు ఇద్దరు తీవ్రంగా గాయపడగా స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సుబ్రమణ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసేందుకు సిగ్గుండాలి

మేడాపై బత్యాల చేసిన విమర్శలకు ఘాటుగా స్పందించిన వైఎస్సార్‌సీపీ నాయకులు


విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు

రాజంపేట టౌన్ : గత ఎన్నికల్లో 45వేల పైచిలుకు ఓట్లతో ఓడిపోయిన టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్యాల చెంగల్‌రాయుడు కనీసం సిగ్గన్నా లేకుండా మేడా మల్లికార్జునరెడ్డిపై ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు హెచ్చరించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఏ రోజు గెలవని వ్యక్తి, కనీసం సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ పత్రాలను కూడా సరిగా నింపలేని చెంగల్‌రాయుడు ఎమ్మెల్యేపై నోరుపారేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్ దళిత వర్గానికి చెందిన వేణుగోపాల్‌కు ఇస్తామని చెంగల్‌రాయుడు ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. తమకు, తమ పార్టీకి దళితులంటే ఎంతో గౌరవం, అభిమానమన్నారు. అయితే చెంగల్‌రాయుడు దళితులకు టికెట్ ఇస్తామని చెప్పే తీరు యావత్ దళిత జాతిని అవమానించేలా ఉందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని మాట్లాడాడు అని, ఇప్పుడు చెంగల్‌రాయుడు నందలూరు హరిజనవాడకు చెందిన వేణుగోపాల్‌ను వచ్చే ఎన్నికల్లో టీడీపీ తరపున నిలుపుతామని వ్యంగంగా చెప్పడం చూస్తుంటే టీడీపీ నాయకులకు దళితుల పట్ల ఉన్న చిన్నచూపునకు ఇదే నిదర్శనమన్నారు. మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబం వందల ఎకరాల భూములు ఆక్రమించుకొని ఉంటే ఇన్నేళ్లు పచ్చమీడియా, చంద్రబాబునాయుడు, చెంగల్‌రాయుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పత్రికా స్వేచ్ఛ గురించి బత్యాల మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. మేడా మల్లికార్జునరెడ్డి భూములను ఆక్రమించుకున్నట్లు నిరూపించాలని లేకుంటే బత్యాల రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు జెనుగు కృష్ణారావు యాదవ్, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, హస్తవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, వడ్డే రమణ, పోలి మురళీరెడ్డి, దండు గోపి, సత్యాల రామకృష్ణ, దాసరి పెంచలయ్య, మురళీఆచారి, గురుమూర్తి, జీవీ సుబ్బరాజు, శంకర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

సినిమాల మోజుతో ఇంటి నుంచి విద్యార్థి పరారీ


ముదివేడు స్టేషన్‌లో విద్యార్థి రవికుమార్

కురబలకోట : సినిమాలు, టీవీ కార్యక్రమాల్లో నటించాలన్న మోజుతో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఇటీవల ఇంటి నుండి అదృశ్యమయ్యాడు. హైదరాబాదులో ఉన్న అతన్ని ముదివేడు ఎస్ఐ ముబీన్ తాజ్ రప్పించి బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు...కురబలకోట మండలం తెట్టు గ్రామం శ్రీరాములవారిపల్లెకు చెందిన వి. రవికుమార్ అంగళ్లు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఇతను ఇంటి వద్ద టీవీలో సినిమాలు చూడటం ఆపై టీవీలో వచ్చే జబర్దస్త్, ఇతర కార్యక్రమాల పట్ల ఆకర్షితుడయ్యాడు. తాను కూడా వారిలాగే నటించాలని కలలుగన్నాడు. దీంతో ఈనెల 9న స్కూల్‌కు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తర్వాత కనిపించలేదు. కుటుంబీకులు ఆందోళనతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటి నుండి అదృశ్యమైన ఇతను కాండ్లమడుగు ద్వారా బి.కొత్తకోటకు వెళ్లి ఆ తర్వాత అక్కడి నుంచి మైసూర్ చేరుకున్నాడు. ఓ వాహనదారుడి సహకారంతో హైదరాబాదు చార్మినార్ వద్దకు చేరుకున్నాడు. అక్కడ అదే సమయానికి సినీ షూటింగ్ జరుగుతుండడంతో యూనిట్‌లోని కుర్రాళ్లతో మాట కలిపి వారి వద్ద వర్కర్‌గా చేరాడు. తాను సినిమాల్లో నటించడానికి హైదరాబాదు వచ్చానని రెండు రోజుల క్రితం ఇంటికి ఫోన్ చేశాడు. ఈ విషయాన్ని కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతన్ని బుధవారం హైదరాబాదు నుండి రప్పించారు. కౌన్సెలింగ్ ఇచ్చి ఎస్ఐ ముబీన్ తాజ్ అతన్ని కుటుంబీకులకు అప్పగించారు.కాగా ఇంటి నుంచి బాలుడు వెళ్లే సమయంలో అతని చేతిలో చిల్లిగవ్వ కూడాలేదు. కేవలం దారిన వెళ్లే వాహనదారులను లిఫ్ట్ అడుగుతూ అతను ఊర్లన్నీ చుట్టేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.